ఆర్‌బికె, సచివాలయ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-జి.మాడుగుల: పాలమామిడి, వంజరిలో రైతు భరోసా కేంద్రం, షోలభం పంచాయతీ గొందిపాడు గ్రామంలో సచివాలయ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే కోటగుళ్లి భాగ్యలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కుడుములు సత్యనారాయణ, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

-పలు పథకాలు అమలు
-సున్నా వడ్డీ కింద రూ.8.54 కోట్లు జమ
- కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: మహిళల ఆర్థిక అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. అమలాపురం పట్టణంలో వై.ఎస్.ఆర్.సున్నా వడ్డీ పథకాన్ని వర్చువల్ విధానంలో సిఎం జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, శాసన సభ్యులు, ట్రైకార్ చైర్మన్, లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్య మంత్రి వర్చువల్ విధానంలో ఇచ్చిన సందేశాన్ని తిలకించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళలకు అనేక పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతి మహిళా పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో సున్నా వడ్డీ పథకం నాలుగో విడత కింద 12 వేల 818 సంఘాల్లోని లక్షా 46 వేల 012 మంది సభ్యుల ఖాతాల్లో రూ.8.54 కోట్లు జమ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే మూడు విడతలుగా అర్హత గల స్వయం సహాయక సంఘాలకు వై.ఎస్.ఆర్.సున్నా వడ్డీని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రూ. 19.26 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.

ఎమ్మెల్యే కే.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, మహిళాభివృద్ధికి సహకారం అందజేస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉండాలని కోరారు. లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. అరకు నియోజక వర్గంలోని ఆరు మండలాల పరిధిలో 3,413 ఎస్.హెచ్.జి ల్లోని 39,664 మంది సభ్యుల ఖాతాల్లో రూ.1,39,06,470 లు జమ చేసినట్లు తెలిపారు. పాడేరు నియోజక వర్గంలో 2,970 ఎస్.హెచ్.జిల్లోని 36,059 మంది సభ్యుల ఖాతాల్లో రూ.1,85,24,061, రంపచోడవరం నియోజక వర్గంలో 6,435 ఎస్.హెచ్.జి ల్లోని 70,289 మంది సభ్యుల ఖాతాల్లో రూ.5,29,64,451లు జమ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.మురళి, తదితరులు పాల్గొన్నారు.

చెక్కును ఇస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, అధికారులు

టీచర్లు, సిఆర్‌టిల జాబితా సిద్ధం చేయాలి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన ప్రైమరీ స్కూళ్లలో ఉపాధ్యాయులు. సిఆర్‌టిలు ఎంతమంది ఉన్నది జాబితా తయారు చేసి సమర్పించాలని రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పిఒ తన ఛాంబర్లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ పాఠశాలలలో ఉపాధ్యాయులను, సిఆర్‌టిలను సద్దుబాటు చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను, సిఆర్‌టిలను సర్దుబాటు చేయడానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని, వారానికి రెండు రోజులు స్కిన్ లెస్ చికెన్ విద్యార్థులకు పెట్టాలని, కోడిగుడ్లు, కూరగాయలు తాజా తాజాగా ఉన్నవి తీసుకోవాలని ఆదేశించారు. విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సుజాత, రామతులసి, హాసిని, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, పి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సిబ్బందితో సమావేశమైన ఎంపిడిఒ బాపన్న దొర

జిఒ 117తో విద్యావ్యవస్థ నిర్వీర్యం

-మాతృభాషకు విద్యార్థులు దూరం
-ఉపాధ్యాయుల ఆగ్రహం
-నేడు ఫ్యాప్టో ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విద్యకు పెద్దపీట వేస్తున్నామంటూనే..జిఒల పేరుతో విద్యారంగంలో ఒడిదుడుకులు ప్రభుత్వం సృష్టిస్తోంది. ఏ సమయంలో ఎటువంటి జిఒలు విడుదల చేస్తారో.. ఏ నిర్ణయాలు తీసుకుంటారో తెలియక ఒకపక్క విద్యార్థులు తల్లిదండ్రులు.. మరోపక్క ఉపాధ్యాయులు అయోమయంలో కొట్టుమిట్టాడు తున్నారు. జిఒ 117తో పాఠశాలల విలీనం, రేషనలైజేషన్ పేరుతో ఉపాధ్యాయులకు పని భారం, ఒకే మీడియంలో విద్యార్థులు చదవాల్సి రావడం తదితర కారణాలతో ఇప్పటికే విద్యావ్యవస్థ దెబ్బతింటోంది.

ప్రాథమిక పాఠశాలల విలీనంతో ఎందరో విద్యార్థులు హైస్కూల్ విద్యకు దూరమయ్యారు. మరోపక్క 6, 7, 8 తరగతులను సింగిల్ మీడియం చేయడంతో ఇంగ్లీష్ మీడియం లో చదవలేక గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులకు స్వస్తి చెబుతున్నారు. 117 జిఒ కారణంగా భవిష్యత్తులో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసే పరిస్థితి కనిపించడం లేదని, కొత్త డిఎస్‌సి అనేది ఓ ప్రశ్నగా మిగులుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను నాశనం చేసే 117 జిఒపై ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల విలీనాన్ని ఉద్దేశించిన ఈ జిఒను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో నిరసనలు తెలుపుతున్నారు. విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తితో కాకుండా సెక్షన్ లను బట్టి ఉపాధ్యాయులను రేషనలైజేషన్ చేయడం దుర్మార్గమైన చర్య అని అంటున్నారు. 3, 4, 5 తరగతుల విలీనాన్ని నిలుపుదల చేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా పాఠశాల విద్యలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం రెండింటిని కొనసాగించాలని, 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్లతో బోధన జరిపిస్తామన్న ప్రభుత్వ హామీ నెరవేరేలా ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం స్పందించక పోవడం సరికాదని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు.

నేడు ధర్నా

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 12న ధర్నాకు ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. ఈ మేరకు పలు సంఘాల నేతలు సన్నద్ధం చేస్తున్నారు. సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ప్రాథమిక పాఠశాలల విలీన ప్రక్రియ ఆపాలని, ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణ జిఒ-117 రద్దు చేయాలని ఫ్యాప్టో పిలుపు మేరకు ధర్నాకు సమాయత్తమవుతున్నారు. ఈ ధర్నాను జయప్రదం చేసేందుకు ఇప్పటికే ఫ్యాప్టో ఆధ్వర్యాన ప్రచారం చేపట్టారు.

జిఒ 117ను రద్దు చేయాలి

ప్రాథమిక పాఠశాలలను బలి చేస్తున్న జిఒ-117 రద్దు చేయాల్సిందే. గతేడాది 3, 4, 5 తరగతుల విలీనంతో ప్రాథమిక పాఠశాలలు మూత పడుతోంది. ఈ విద్య ఏడాదిలో ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు తగ్గడానికి కారణం ప్రభుత్వ విధానాలే. పాఠశాలల విలీనం ప్రజాస్వామికం. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేయాలి.

వి.మహేశ్వరరావు
యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రమాదంలో చదువులు

ప్రభుత్వం జారీ చేసిన జిఒ-117 మేరకు ఉపాధ్యాయులను పునర్విభజన చేస్తే ప్రభుత్వం చెబుతున్నట్లుగా నాణ్యమైన విద్య కాదు కదా అసలు చదివే అందకుండా పోయే ప్రమాదం ఉంది. పాఠశాలల విలీనం, ఇంగ్లీష్ మీడియం పేరుతో విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు. 3, 4, 5 తరగతుల విలీనాన్ని వెంటనే నిలుపుదల చేయాలి. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోంది. ప్రాథమిక పాఠశాలల విలీనంతో ఎందరో విద్యార్థులు హైస్కూల్ విద్యకు దూరమయ్యారు.

ఆర్.జగన్ మోహన్ రావు
ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయులపై తీవ్ర పని భారం

విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే నిర్ణయాలు మానుకోవాలి. ఉపాధ్యాయులపై పని భారం తీవ్రంగా పెరుగుతుంది. పాఠశాలల్లో వేలాది పోస్టులు మిగులుగా తేలే ప్రమాదం ఉంది. మెగా డిఎస్‌సి నిర్వహించి వేలాది పోస్టులు భర్తీ చేస్తామన్న ప్రభుత్వం టీచర్ల పునర్విభజనతో ఆ హామీకి చెల్లు చీటీ ఇచ్చినట్లే. ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని చెబుతూనే..మరోవైపు ఉపాధ్యాయ పోస్టులు కుదించేందుకు పూనుకుంటుంది.

ముఖి శేషాద్రి
గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

విద్యా రంగం అభివృద్ధికి అడ్డంకి

విద్యా రంగం అభివృద్ధికి అతిపెద్ద అడ్డంకిగా ఉన్న జిఒ-117ను రద్దు చేయడం ద్వారా మాత్రమే ఉపాధ్యాయ విద్యారంగానికి మేలు జరుగుతుంది. ఉపాధ్యాయులను అదనంగా చూపిస్తూ విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్న ఉత్తర్వులను వెంటనే సవరించాలి. జిఒ-117తో విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. జిఒ-117ను రద్దుచేసి ప్రాథమిక పాఠశాల విలీనాన్ని నిలుపుదల చేయాలి.

కె.నీలకంఠం
టిడబ్ల్యూటియు జిల్లా అధ్యక్షుడు

ఆగని శిశు మరణాలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని పలు పంచాయతీల్లో శిశు మరణాలు ఆగలేదు. ఉప్ప సబ్ సెంటర్ పరిధిలో 7 శిశు మరణాలు అదికంగా నమోదు కావడం గమనార్హం. వారం వ్యవధిలోనే 7గురు శిశులు మతి చెందారు. మండలంలోని బి.బొడ్డపుట్టు పంచాయతీ బొర్రా మామిడి గ్రామంలో పాడి బాలక్రిష్ణ, లావణ్య దంపతుల రెండో సంతానం 4నెలలు బాబు అనారోగ్యంతో గురువారం రాత్రి మరణించాడు. గురువారం ఓల్డ పంచాయతీ ఇస్కగరువు గ్రామంలో పలాసీ సంజీవరావు 4 నెలల బాబు గురువారం రాత్రి హఠాత్తుగా మరణించాడు. మత్స్యపురం పంచాయతీ ఉట్టగెడ్డ గ్రామంలో 6వ తేదీ ఆదివారం రాత్రి సుబ్బారావు, సుందరమ్మ దంపతుల రెండు నెలల బాబు మతి చెందగా అదే రోజు మెరక చింత పంచాయతీ కరకపూట్టు గ్రామంలో వలసనైని సత్తిబాబు దయవతి దంపతుల 5నెలల బాబు మృతి చెందారు. రెండు రోజుల గడవకముందే పట్టాం పంచాయతీ బూరువలస గ్రామంలో వంతల రత్నలు రాజు దంపతులకు పుట్టిన రెండు నెలల కుమారుడు ఈనెల 9న బుధవారం జలుబు దగ్గుతో మృతి చెందారు. శిశుమరణాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటన వరకే పరిమితం అవుతుందని పలువురు గిరిజనులు విమర్శించారు..పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని గిరిజన సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక టి.కృష్ణారావు, కొర్రా ఆనంద్‌లు డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్

పివిటిజిలకు నిధులు కేటాయింపులో అన్యాయం

ప్రజాశక్తి- పాడేరు: పాడేరు ఐటీడీఏ 11 మండలాల పరిధిలోని పివిటీజీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని, వారికి ప్రత్యేక నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ విమర్శించారు. చింతపల్లి గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివాసి గిరిజన సంఘం మండల సహాయ కార్యదర్శి పి.బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పివిటిజిలకు ఐటిడిఏ ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు పాలికి లక్కు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పివిటిజిల అంత్యోదయకార్డులు రద్దు చేసిందన్నారు. వ్యక్తిగత సబ్సిడీ రుణాలు, గ్రామాల్లో సీసీ రోడ్లు, మంచినీటి, కమ్యూనిటీ హాలు, అంగన్వాడీ, భవనాలు నిర్మించాలన్నారు.2019నుండి 2023 వరకు 11మండలాల్లో 294 ఇల్లులు మాత్రమే పీవీటిజీ లకు మంజూరు చేసారని తెలిపారు. వ్యవసాయ యంత్రాలు, మిరియాల నిచ్చెన్నలు పూర్తి సబ్సిడీతో పంపిణి చేయలేదన్నారు. సబ్సిడీ తగ్గించడంతో ఎక్కువ మంది పివిటిజీలు ఆర్థిక ఇబ్బందులతో తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పివిటిజిలకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా గౌరవధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, కొర్ర బాలయ్య, జి కె వీధి మండల నాయకులు ఎ.బాజ్జిబాబు, జి.సత్యనారాయణ, పివిటిజి నాయకులు కొర్ర చిట్టిబాబు, పాంగి సూరిబాబు, పాంగి లక్ష్మణరావు, గెమ్మెలి రమేష్, మాజీ ఎంపీటీ సీ గుంటా జున్ను పాల్గొన్నారు.

శిథిలమైన ఉమ్మడివరం పాఠశాల భవనం

★ ఒరిగిపోయి, స్లాబ్ పెచ్చులూడిన వైనం
★ ఎప్పుడు కూలిపోతుందోనని భయాందోళన
★ ఆరుబయటే తరగతులు
★ వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలం రేఖపల్లి పంచాయతీ పరిధి ఉమ్మడివరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో భవనం ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. ఈ పాఠశాల భవనం నిర్మించి సుమారు రెండున్నర దశాబ్దాలు కావస్తుంది. ప్రస్తుతం భవనం పూర్తిగా శిథిలమై స్లాబ్ కిందకి వంగటంతో పాటు భవనం పక్కకు ఒరిగిపోయింది. స్లాబ్ పెచ్చులూడిపోయాయి. వర్షాకాలం వస్తే స్లాబ్ లీకైయి గదుల్లోకి నీరు చేరి విద్యార్థులు కూర్చునేందుకు ఇబ్బందిగా మారింది. వర్షాలు కురిస్తే బిక్కుబిక్కుమంటూ చదువు కుంటున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎండ వస్తే చెట్ల కింద క్లాసులు వేరువేరుగా నిర్వహిస్తున్నారు. వర్షం పడితే వేరే భవనం లేకపోవడంతో విద్యార్థులందరినీ ఒక రూములో కూర్చోబెట్టి క్లాసులు చెబుతున్నారు. దీంతో ఏమి చెబుతున్నారో అర్థం కావడం లేదని విద్యార్థులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు భవనం పరిస్థితి చూసి పాఠశాలలకు పంపేందుకు ఆందోళన చెందుతున్నారు. మరుగుదొడ్లు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ స్థితిలో ఉంటే పిల్లల్ని మేము బడికి పంపించలేమని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. తక్షణమే కొత్త భవనం ఏర్పాటు చేస్తే పిల్లల్ని బడికి పంపిస్తామని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ సమస్యలపై ఎన్నోసార్లు ఎంవిఒకు దరఖాస్తులు పెట్టామని, ఇంత వరకు సమస్యలు పరిష్కారం కాలేదని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం నిర్మించాలని పాఠశాల హెచ్‌ఎం కోరుతున్నారు.

ఊడిన పెచ్చులు, చెత్తాచెదారంతో ఉన్న శిథిలమైన భవనం

శిథిలావస్థలో ఉన్న మరో భవనం వరండాలో నిర్వహిస్తున్న తరగతులు

ఆరుబయట వంట చేయాల్సి వస్తోంది

భవనం పూర్తిగా పాడైపోయింది. కనీసం వంట చేయడానికి వంటశాల కూడా లేదు. ఆరుబయటే వంట చేయాల్సి వస్తుంది. వర్షం వచ్చినప్పుడు మా ఇంట్లో వంట చేసి తీసుకొచ్చి పెడుతున్నాను. ఆ సమయంలో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తక్షణమే పాఠశాలకు కొత్త భవనంతో పాటు వంటశాల నిర్మించాలి. అలాగే గ్యాస్ స్టవ్, గ్యాస్ ఇప్పించాలి. వర్షం వచ్చినప్పుడు కట్టెపుల్లలు తడిసిపోయి వంట చేయడం చాలా ఆలస్యమవుతుంది. దీంతో పిల్లలు ఆకలితో ఇబ్బంది పడాల్సి వస్తుంది. అధికారులు స్పందించి పై సమస్యలను పరిష్కరించాలి.

- సున్నం విజయ, మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు

ఒకే గదిలో తరగతుల నిర్వహణతో ఇబ్బంది

మా బడి భవనం పాడైపోయి చాలాకాలమైనా ఇంతవరకు కొత్త భవనం కట్టించలేదు. ఇప్పుడు పక్కనున్న భవనంలో, ఆరు బయటనే 70 మంది పిల్లలను ఒక దగ్గర కూర్చొబెట్టి పాఠాలు చెబుతున్నారు. ఉపాధ్యాయులు మంచిగా చెబుతున్నా, అందరూ ఒకే దగ్గర కూర్చోవడంతో ఏ పాఠం చెబుతున్నారో, మా పాఠం ఏమిటో అర్థం కావల్లేదు. కరెంటు, ఫ్యాన్లు లేవు. మేము ఎలా చదువుకోవాలి? తక్షణమే ఐటిడిఎ పిఓ స్పందించి కొత్త బడి భవనం కట్టించాలి.

-సున్నం విజయ్, నాలుగో తరగతి విద్యార్థి

146 మంది వైద్యులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి రంపచోడవరం

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బందిపై అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కొరడా ఝుళిపించారు. రంపచోడవరం డివిజన్ వ్యాప్తంగా వైద్యశాఖలో ఐదురోజులుగా విధులకు గైర్హాజరైన 146 మంది వైద్యాధికారులు, ఎఎన్ఎమ్‌లు, స్టాఫ్ నర్సులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య సహాయకులకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే ముఖ యాప్‌లో సాంకేతిక లోపంతో కారణంగానే హాజరు నమోదు కాలేదని తెలుస్తోంది.

డ్రాపౌట్స్ విద్యార్థులను పాఠశాలలకు పంపించండి

ప్రజాశక్తి-అడ్డతీగల

డ్రాపౌట్స్ విద్యార్థులను పాఠశాలలకు పంపించే విధంగా కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులను ఎంపిడిఒ బాపన్న దొర ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాపౌట్స్ విద్యార్థులు ఎందుకు స్కూల్ మానేశారో తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి పూర్తి సమాచారం తీసుకుని తిరిగి విద్యార్థులను పాఠశాలలకు పంపించాలని సూచించారు. సచివాలయం పరిధిలో ఒక్కొక్కరు ఒక స్కూల్ / హాస్టల్ విజిట్ చేసి ముందుగా లాంగ్ డ్రాప్ అవుట్ గుర్తించాలని, డ్రాప్ అయిన వారు ప్రస్తుతం ఏమి చేస్తున్నారరో వివరాలు సేకరించాలన్నారు. ఇందులో భాగంగా అడ్డతీగలలోని ఎస్‌టి బాయ్స్ హాస్టల్‌ను విజిట్ చేశారు. ఇద్దరు లాంగ్ డ్రాప్ అవుట్ ఉన్నారని గుర్తించారు. పంచాయతీ కార్యదర్శులు, అడ్డతీగల సచివాలయం-1 సిబ్బంది మహేష్, వీరలక్ష్మి జెడ్పీ స్కూల్‌లో ముగ్గురిని, ఎస్‌టి బాయ్స్ హాస్టల్‌లో ఒకరిని జాయిన్ చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

ఆశ్రమ పాఠశాలలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సప్పర్లలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమం పాఠశాలను ఎంపీడీవో ఉమామహేశ్వరావు శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులు క్లాస్ రూమ్‌లోకి వెళ్లి వారు విధంగా విద్యను అభ్యసిస్తున్నారో అడిడి తెలుసుకున్నారు. అనంతరం వంటశాల సందర్శించి తనిఖీ నిర్వహించారు. డ్రాప్ అవుట్సు ఎంతమంది ఉన్నారు ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి డిప్యూటీ తహశీల్దారు, విఆర్ఓ పాల్గొన్నారు.

మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ప్రస్తుతం మండలంలో వ్యవసాయ శాఖ చేపట్టే కార్యక్రమాల గురించి చర్చించారు. ప్రస్తుతం వరి నాట్లు అవుతున్న నేపథ్యంలో వరి యాజమాన్య పద్ధతులు రైతులకు తెలియజేస్తామని, ఎరువులు, పురుగు మందులు ఆర్‌బికెల్లో ఉంచుతామని మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి తెలిపారు. సలహా మండలి అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు, పరదాలు రాయితీ మీద సరఫరా చేయాలని కోరారు. సభ్యులు మాట్లాడుతూ మినుములు, పెసలు విత్తనాలు రాయితీ మీద ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జయతి రాజులమ్మ, గోకిరి చిన్నారావు, జోరంగి రామారావు, ఏఈవో సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ సలహా మండలి సభ్యులు, సిబ్బంది

విద్యా సామగ్రి పంపిణీ

నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి:ఆదివాసీ గిరిజన సంఘం, శారద ట్రస్ట్ సేవలు అభినందనీయమని జెడ్‌పిటిసి గంగరాజు కొనియాడారు. శుక్రవారం మండలం లోని కోనేపల్లి పాఠశాల ఆవరణలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శారద ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ వి.తిరుపతిరావు, అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజు హాజరై 16 పాఠశాలల పరిధిలో చదువుతున్న సుమారు 600 మంది గిరిజన పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి నాలుగు నోట్ పుస్తకాలు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పిటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి తోడ్పడే మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. శారద ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ వి తిరుపతిరావు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలోని పేద విద్యార్థులకు గ్రూప్ 1,2 ప్రత్యేక శిక్షణ తరగతులు,మరెన్నో సేవా కార్యక్రమాలు విస్తృత పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దూర్ తెగల అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.తౌడన్న, శారద ట్రస్ట్ డైరెక్టర్ ఎం.గౌరి శంకర్, గిరిజన సంఘం వైస్ ప్రెసిడెంట్ ఎస్.క్రిష్ణమూర్తి, అనంతగిరి మండల కన్వీనర్ శెట్టి రాంబాబు, కోతేపల్లి పంచాయతీ కార్యదర్శి వై.రామస్వామి, యుటిఎఫ్ మండల అధ్యక్షులు పుడిని దేముడు, ప్రధానోపాధ్యాయులు ఎ మల్లికార్జున, పాల్గొన్నారు.

'వారాహి'తో వైసిపిలో గుబులు

ప్రజాశక్తి- సీతమ్మధార : పవన్‌కల్యాణ్ వారాహి యాత్ర, రోడ్‌షో విజయవంతం కావడంతో ఐటి మంత్రి గుడివాడ అమర్ తట్టుకోలేక లేనిపోని విమర్శలు చేస్తున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మండిపడ్డారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో వైసిపి దోపిడీలు, అక్రమాలపై రోడ్‌షోలో పవన్ మాట్లాడుతుంటే, విస్సన్నపేట భూకుంభకోణం, ఇతర అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని మంత్రి అమర్ గుండెల్లో గుబులు పట్టుకుని, మతిభ్రమించి అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారన్నారు. గురువారం పోలవరం వెళ్లిన సిఎం జగన్ అక్కడి నిర్వాసితులతో మాట్లాడలేదని, పరిశ్రమల మంత్రిగా అమర్ జిల్లాకు ఒక్క పరిశ్రమ తేలేదని దుయ్యబట్టారు. గంజాయి అరికట్టలేని ముఖ్యమంత్రికి మంత్రి అమర్‌నాథ్ బానిస అన్నారు. ఢిల్లీ వెళ్లినపుడు బాబాయ్ గొడవ తప్ప, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, పోలవరం, ప్రత్యేక హోదా అంశాలపై ఒక్కసారైనా జగన్ మాట్లాడారా అని ప్రశ్నించారు. వారాహి పర్యటనతో వైసిపి నేతల అక్రమ, అవినీతి బాగోతాలన్నీ బయటపడక తప్పదని మూర్తియాదవ్ హెచ్చరించారు. తన తల్లి విజయమ్మను ఓడించారని కక్షతో ముఖ్యమంత్రి జగన్ విశాఖను ధ్వంసంచేయాలని చూస్తున్నారని, అందులో భాగంగానే ప్రభుత్వ ఆస్తులను రూ.25వేల కోట్లకు తాకట్టు పెట్టేశారని ఆరోపించారు. సమావేశంలో రవి, ప్రసాద్, రూప పాల్గొన్నారు.

పాఠశాలలో మొక్కల నాటివేత

మొక్కలు నాటుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి:నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎగువశోభ పంచాయతీ కొత్తవలస బాలుర ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో స్థానిక జెడ్పిటిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొక్కలు నాటడంతో కాలుష్యం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొర్రాశ సింహాద్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.అప్పలస్వామి, పంచాయతీ సెక్రటరీ .రమేష్ పాల్గొన్నారు

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:జగనన్నకు చెబుదాం- స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు జవాబుదారీ గా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు 72 ఫిర్యాదులు అందాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒ. వి. అభిషేక్ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 65 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులపై సత్వరమే ఎండార్స్‌మెంట్ వేయాలని ఆదేశించారు. రోడ్లు, తాగునీటి సమస్యలు, గృహ నిర్మాణాల బిల్లులు, భూ సమస్యలు, రీసర్వే, ఉపాధి అవకాశాల కోసం ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. కొయ్యూరు మండలం ఆడాకుల పంచాయతీ కిష్టారం గ్రామానికి చెందిన ఎడెం శివ జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించానని బిల్లు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. పెదబయలు మండలం పెదెరు గ్రామ పంచాయతీ అంబవిడి గ్రామానికి తాగునీరు, డ్రైనేజ్, సిసిరోడ్డు మంజూరు చేయాలని కె.ఎస్.కుమార్, మోహన్ బాబు అర్జీని అందజేశారు. ముంచంగిపుట్టు మండలం కుమడ గ్రామ పంచాయతీ పరిధిలోని కెందుగూడ, సిరిమెట్ట, కిముడుపల్లు, పిట్టగెడ్డ, దొరగూడ గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని కిల్లో రాందాసు, కె.కోటేశ్వరరావు వినతి పత్రం సమర్పించారు. పాడేరు మండలం సిల్వర్ నగర్ కాలనీలో 30 కుటుంబాలు జీవిస్తున్నాయని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, సిసి రోడ్డు నిర్మించాలని పాడేరు సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి వినతి పత్రం అందజేశారు. జి.మాడుగుల మండలం పాడేరు గ్రామానికి రోడ్డు నిర్మించాలని పలువురు దరఖాస్తు చేశారు. పెదబయలు మండలం గుల్లేలు గ్రామ పంచాయతీ చిన్న గుల్లేలు, మర్రిపుట్టు రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలని సర్పంచ్ జి.సత్యాలమ్మ.. జి. పండు నాయుడు, జి.కేశవ రావు తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్. ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివిఆర్ఎం. రాజు, ఐటిడిఏ పరిపాలనాధికారి హేమలత, పంచాయతీ రాజ్ ఇ ఇ టి.కొండయ్య పడాల్, పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, జిల్లా: పంచాయతీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్, పిడి సూర్యలక్ష్మి, గురుకుల ప్రిన్సిపాల్ మూర్తి గృహ నిర్మాణశాఖ ఇ ఇ బాబు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఇంటింటా ఓటరు సర్వే

పాడేరు: ఇంటింటికి ఓటరు సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు నమోదు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణ ధృవీకరణ పత్రాల ఆధారంగా మృతి చెందిన ఓటర్లను తొలగించాలని ఆదేశించారు. పివిటిజి ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 35 శాతం సర్వే పూర్తి చేశారని, మిగిలిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బిఎల్ఓలు వాలంటీర్లు లేకుండా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. వచ్చే అక్టోబరు నెలలో మండల స్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియపై సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాకు 3100 వివి ప్యాడ్స్ వచ్చాయని చెప్పారు. ఈ సమావేశం లో పాడేరు శాసన సభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, శతక బుల్లిబాబు, డి.ఆర్ఓ పి.అంబేద్కర్, వివిద రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రవిబాబు నియామకంపై హర్షం

బాణా సంచాను కాలుస్తున్న నాయకులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:గవర్నర్ కోటాలో కుంభా రవిబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం అభినందనీయమని అరకులోయ వైసీపీ సీనియర్ నేతలు పాంగి.చిన్నారావు, సమర్డి.భాస్కరరావు, గుడివాడ ప్రకాష్, పల్టాసింగి విజయ్ కుమార్, కొండలరావు,సుందర్‌రావు, పాంగి పరశురాం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం అరకులోయ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద టపాసులు పేల్చి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం చేస్తుందన్నారు. 2024లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ హరి, పాల్గొన్నారు.

డుంబ్రిగుడ:రవి బాబుకు ఎమ్మెల్సీగా అధికారికంగా ప్రకటించడంపై మండలంలోని వైసిపి నాయకులు శుక్రవారం హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బాణసంచా కాల్చి ఆనందంగా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పురం మండల అధ్యక్షుడు కేహరి, మాజీ పిఎసిఎస్ బ్యాంక్ అధ్యక్షుడు బి.కొమ్ములు నాయుడు, నాయకులు హెచ్‌బి రామానాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ - శ్రమ్ కార్డులకు ఉచిత నమోదు

కార్డును ఇస్తున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి పాడేరు :- అసంఘటిత రంగ కార్మికులు ఈ శ్రమ్ కార్డులకు తమ పేర్లు నమోదు నమదు చేసుకోవాలని అల్లూరి జిల్లా కార్మిక సహాయ అధికారి సూర్యనారాయణ సూచించారు. శుక్రవారం పాడేరులో పలువురు కార్మికుల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల అసంఘటిత రంగ కార్మికులైన వ్యవసాయ కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు, అన్ని రకాల వాహన డ్రైవర్లు, క్లీనర్లు, కండక్టర్లు, గ్యారేజ్లో పనిచేసే కార్మికులు, దుఖాణాలు, హోటల్స్, రైస్ మిల్ కార్మికులు, అంగన్వాడీ, ఆశ వర్కర్లు, మత్స్యకారులు, భవన నిర్మాణ కార్మికులు అర్హులని తెలిపారు. సమీపంలో కామన్ సర్వీస్ సెంటర్లోను, మీ-సేవ సెంటర్లోను, గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుని ఈ- శ్రమ కార్డు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక పథకాలు, వివిధ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు.

రోడ్డు సౌకర్యం లేక బాలింత మృతి

మాట్లాడుతున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ పరిధి ఉబ్బెంగుల గ్రామ బాలింత వంతల బాసంతి మృతి బాధాకరమని గిరిజన మహిళా సంఘం (ఐద్వా)మండల అధ్యక్షురాలు ఈశ్వరి, కార్యదర్శి విజయ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘం మండల కార్యదర్శి విజయ మాట్లాడుతూ, రోడ్డు సౌకర్యం లేక పోవడంతోనే బాలింతరాలు మృతి చెందిందన్నారు. పంచాయతీల అభివృద్ధి నిమిత్తం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 14,15 ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించి న రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మృతురాలు బాలింతను సుమారు 5 కిలో మీటర్లు దూరంలో ఉన్న సంగంవలసా గ్రామం వరకు మోసుకుని వచ్చి అంబులెన్స్‌లో ఆసుపత్రిలో చేర్పించారన్నారు.రోడ్డు సౌకర్యం లేకే సరైన సమయంలో ఆసుపత్రిలో చేర్పించ లేక పోయారని, దీంతోనే బాలింత మృతి చెందిందని తెలిపారు. రోడ్డు, వంతెన మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఈ ఘటనను తక్షణమే స్పందించాలని లేనిపక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో పర్యాటకులను ఆకర్షించే విధంగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ఐటీడీఏ పీవో వి .అభిషేక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయం నుండి ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్, పద్మాపురం, మ్యూజియం అధికారులతో పద్మాపురం గార్డెన్, కొత్తవలస, చాపరాయి గడ్డ పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పద్మాపురం గార్డెన్లో గిరిటేజ్ క్యాంటీన్ ఏర్పాటు చేసి గిరిజన వంటకాలను పర్యాటకులకు అందించాలని సూచించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. పద్మాపురం గార్డెన్లో నిర్మించిన ట్రీ హాట్‌లను ఈనెల 16వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పద్మాపురం గార్డెన్లో వీడీవీకే, గిరిజన సహకార సంస్థ సంయుక్తంగా గిరి మార్ట్ ఏర్పాటు చేసి గిరిజన ఉత్పత్తులను, అటవీ ఉత్పత్తులను పర్యాటకులకు విక్రయించాలని సూచించారు. కొత్తవలస హెచ్ఎన్‌టిసిలో ఏర్పాటు చేసిన కాటేజీలకు పూర్తిస్థాయిలో విద్యుత్తు, వాటర్ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కొత్తవలసలో కాటేజీల పరిసరాల్లో 200 సిల్వర్ ఓక్ మొక్కలను నాటాలని చెప్పారు. కొత్తవలసలో పనులను ఈనెల 16వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. చాపరాయిని సుందరంగా తీర్చిదిద్ది పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎస్ సహాయ ప్రాజెక్టు అధికారులు వీ.ఎస్. ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, మ్యూజియం క్యూరేటర్ మురళి, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజిబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఏఈ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం ప్రారంభం

ప్రారంభిస్తున్న ఉపేంద్ర

ప్రజాశక్తి- పెదబయలు రూరల్: మండలంలోని ఇంజేరి గ్రామంలో శుక్రవారం నూతన తపాలా కార్యాలయాన్ని అరకు సబ్‌డివిజన్ ఐపిఓ బి.ఉపేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంజేరి పంచాయతీ 48 గ్రామాలకు పోస్టాఫీస్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.పోస్టు ఆపీసు లేకపోవడంతో ఇంజేరి ప్రజలు సుమారుగా 20కిలోమీటర్ దూరంలో లింగేటి పోస్ట్ ఆఫీసుకు వచ్చే వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ పర్యటన ఎటువైపు..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : జనసేన అధినేత పవన్ కల్యాణ్ విశాఖ పర్యటన అంటేనే అటు ప్రభుత్వం, ఇటు పోలీస్ యంత్రాంగంలో గుబులు రేగుతోంది. శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున పవన్‌కు అనుమతులు కంటే అననుకూల పరిస్థితులే నగరంలో ఎదురవుతున్నాయి. మరోపక్క ఆయన తాజా పర్యటనపై విమర్శలూ లేకపోలేదు. సొంత అజెండాగాక ప్రధాని మోడీ దూతలా వ్యవహారం ఉందంటూ పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

నగరంలో అత్యధికంగా పవన్ అభిమానులు, ఆయనంటే ఇష్టపడేవారు ఉన్నారన్నది తెలిసిందే. ఏ సినిమా రిలీజైనా ఫ్యాన్స్ చేసే హంగామా అంతా ఇంతా కాదు. అలాంటిది పవనే నేరుగా వస్తున్నాడంటే కేరింతలు, చప్పట్లు, కేకలు అన్నీ ఇన్నీ కావు. ఇవన్నీ ఒక ఎత్తైతే వచ్చే వారంతా ఓట్లేయడం లేదన్న విషయాన్ని పవన్ కల్యాణ్ కూడా గుర్తించారు. గురువారం రాత్రి నగరంలోని జగదాంబ జంక్షన్‌లో జరిగిన వారాహి విజయ యాత్ర బహిరంగ సభలో 'నేను సిఎం అవ్వాలనుకుంటే అయిపోను.. ఇక్కడకి వచ్చిన మీరంతా అనుకోవాలి, వచ్చిన వారంతా ఓట్లేయాలి' - అంటూ చెప్పడం వెనుక పెద్ద ఆంతర్యమే దాగి ఉంది. గతంలో తాను గాజువాకలో నిల్చొన్నప్పుడు జరిగిన అనుభవం పునరావృతం కాకుండా పవన్ జాగ్రత్త పడ్డాడని అర్థమవుతోంది. ఇదిలా ఉండగా గురువారం నాటి సభలో సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకూ పవన్ ప్రసంగం సాగగా, మొదటి 5 నిమిషాల్లోనే వందల సంఖ్యలో సభా ప్రాంగణం నుంచి వెనుదిరగడం గమనార్హం.

ప్రధానికి తనెంతో ఇష్టమనే ప్రచారంలో మునిగిన పవన్

తాను ఒంటరిగా లేనన్న సంకేతాన్ని పవన్ కల్యాణ్ విశాఖ సభ ద్వారా ఇచ్చారు. తనను ప్రధాన మంత్రి మోడీ బాగా ఇష్టపడతాడంటూ పదేపదే చెప్పుకోవడం కనిపించింది. రాష్ట్రంలోనూ, విశాఖలో జరుగుతున్న ప్రభుత్వ అక్రమాలన్నిటిపైనా ఫిర్యాదులు చేస్తానంటూ బెదిరింపులకు దిగారు. అయితే, సభికుల నుంచి పెద్దగా స్పందన కానరాలేదు.

అనేక సందేహాలు

హోదాపై కేంద్రాన్ని ప్రశ్నిస్తానంటూ గతంలో చెప్పిన పవన్ తాజాగా ఎక్కడా ప్రశ్నించడం లేదు. మోడీకి అత్యంత ప్రీతిపాత్రుడునని చెబుతున్నా.. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేందుకు ప్రయత్నించలేదు. సరికదా.. ఆ నెపాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై ఎందుకు నెడుతున్నారన్నది రాజకీయ కోణం నుంచి చూసిన వారెవరికైనా అర్థమవుతుంది. కేవలం తన పోరుబాట అంతా రాష్ట్రంలోని వైసిపిపైనే అన్నది దండలో దారంలా వెల్లడవుతోంది. మోడీ వద్ద తనకున్న పలుకుబడితో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపగలిగితే పవన్‌కు విశాఖ ప్రజలు ఆదరిస్తారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కానీ ఆ పనిచేస్తానని మాత్రం పవన్ ఎక్కడా హామీ ఇవ్వకపోవడం కనిపిస్తోంది. ఈ నెల 10 నుంచి 19 వరకూ వారాహి యాత్రను ఈ ప్రాంతంలో చేపట్టాలని జనసేన నిర్ణయించుకున్నప్పటికీ ఎప్పుడెప్పుడు.. ఎక్కడెక్కడికి వెళ్లాలన్నది శుక్రవారం వరకూ స్పష్టత ఇవ్వలేకపోయింది. అప్పటికప్పుడు షెడ్యూల్‌ను తయారుచేసి మధ్యాహ్నం తర్వాత ఆ పార్టీ నేతలు విడుదల చేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు సర్పంచి స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన సీలేరు ఎంపీపీ స్కూల్‌ను శుక్రవారం జికె.వీధి ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులు ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లో మంచినీరు, విద్యుత్తు, ఫర్నిచర్ అన్ని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఓటర్లకు ఎటువంటి సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. ఇక్కడ ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జికె వీధి డిప్యూటీ తహశీల్దారు, విఆర్ఓ, స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధిలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఎదురెదురుగా వచ్చిన కారు, స్కూటీ ఢీకొన్నాయి. కాశీపట్నం నుండి చిమిడిపల్లి వెళుతున్న స్కూటీ, అరకు నుండి వైజాగ్ కు వెళ్తున్న కారు ఢీ కొన్నాయి. బైక్‌పై వెళుతున్న బీంపోలు పంచాయితీ చిమిడిపల్లి గ్రామానికి చెందిన మాదల శ్రీనుకు తీవ్ర గాయాలు అయ్యాయి.

స్థాయీ సంఘంలో 48 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. అజెండాలో 48 అంశాలు పొందుపరచగా అన్ని అంశాలూ అమోదం పొందాయి.

తీరని డంపింగ్ యార్డు సమస్య

జోనల్ కార్యాలయంలోనే చెత్త
ఆ తరువాత కాపులుప్పాడకు తరలింపు
రవాణాకు భారీ ఖర్చు
ప్రతిపాదన దశ దాటని స్థల కేటాయింపు
ఆసక్తి చూపని మంత్రి అమర్‌నాథ్

జోనల్ కార్యాలయంలో ఉన్న చెత్త

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జివిఎంసి అనకాపల్లి జోన్ డంపింగ్ యార్డుకు స్థలం కరువైంది. 2013 జులై 31న జివిఎంసిలో అనకాపల్లి పురపాలక సంఘం విలీనమైనప్పటి నుంచీ స్థల ప్రతిపాదన కార్యరూపందాల్చలేదు. జిల్లా కేంద్రమైన తరువాత డంపింగ్ యార్డు సమస్య తీరుతుందని అనకాపల్లి ప్రజలు భావించినా పరిష్కారంకాలేదు. చెత్త వేయడానికి డంపింగ్ యార్డు లేకపోవడంతో జోనల్ కార్యాలయ ఆవరణలో రోజుకు 82 నుంచి 90 టన్నుల చెత్త వేస్తున్నారు. ఇక్కడ నుంచి రెండు టిప్పర్లు, రెండు టారాస్, రెండు మినీ టిప్పర్లు ద్వారా విశాఖ నగరంలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అనకాపల్లి నుంచి కాపులుప్పాడకు చెత్త తరలించడానికి రోజుకు రూ.25 వేలకుపైగా ఖర్చవుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వాలు, అనకాపల్లి ఎమ్మెల్యే, ఎంపీలు, జివిఎంసి పాలకవర్గాలు మారుతున్నా డంపింగ్ యార్డు సమస్య మాత్రం అలాగేవుంది. పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రం అనకాపల్లిలో డంపింగ్‌యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా నాలుగేళ్లు గడించింది తప్ప స్థల కేటాయింపు జరగలేదు. పట్టణం నడిబొడ్డునవున్న జోనల్ కార్యాలయ ఆవరణలోకి చెత్త తరలించడం వల్ల పరిసర ప్రాంత ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఆది నుంచీ అవస్థలే.. !

అనకాపల్లి పురపాలక సంఘం కాలం నుంచీ డంపింగ్ యార్డు సమస్య వుంది. చాలా కాలం శారదానగర్ పంచాయతీ కార్యాలయం వెనుకనున్న స్థలంలోకి చెత్త తరలించారు. గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కూండ్రం పంచాయతీ జగ్గయ్యాపేట వద్ద స్థలంలో కొంత కాలం చెత్త వేశారు. ఇక్కడ కూడా చెత్త వేయడాన్ని ప్రజలు వ్యతిరేకించడంతో మరోదారిలేక కొప్పాక వద్ద ఖాళీ స్థలంలోకి చెత్త తరలించారు. అక్కడా స్థానికుల నుంచి అభ్యంతరాలు రావడంతో ప్రత్యామ్నాయంలేక జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయ ఆవరణలోని స్థలంలోకి చెత్తను తరలిస్తున్నారు. డంపింగ్ యార్డుకు కనీసం పది నుంచి 15 ఎకరాల వరకు స్థలం అవసరం కానుంది. అయితే జివిఎంసికి భూమి బదలాయించకపోవడంతో డంపింగ్‌యార్డు సమస్య తీరలేదు. వర్మీ కంపోస్టు ఎరువు తయారుచేసి అమ్మడం ద్వారా కొంత ఆదాయం సమకూరడానికి జోనల్ కమిషనర్‌గా పనిచేసిన షేక్ సుభాని గట్టి ప్రయత్నం చేశారు. ఆయన బదిలీ తరువాత ఆ ప్రయత్నం కొనసాగింపు లేదు. స్థానిక ఎమ్మెల్యేలకు డంపింగ్ యార్డు తరలించాలన్న శ్రద్ధలేదు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలేదు. స్థానికంగా వీరు నివసించకపోవడంతో దోమల బెడద వీరికి తెలియడంలేదు.

త్వరలో స్థలం కేటాయింపు

డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని జివిఎంసి నుంచి కలెక్టర్‌కు ప్రతిపాదనలు వెళ్లాయి. స్థలం కేటాయించే వరకు జోనల్ కార్యాలయం ఆవరణలోకి చెత్త తరలించకతప్పదు. స్థల పరిశీలన జరుగుతోంది. త్వరలో స్థలం కేటాయిస్తారని ఆశిస్తున్నాం.

ఎస్.వెంకటరమణ,
జోనల్ కమిషనర్, అనకాపల్లి జోన

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో తీవ్ర నష్టం

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అయితే రాష్ట్రానికి, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు తీవ్ర నష్టం జరుగుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 911వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎఫ్ఎండి, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, ప్లాంట్ డిజైన్, సిఎంఇ, విఎస్‌జిహెచ్ విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, గంధం వెంకటరావు, కారు రమణ మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసే వరకూ పోరాటాలు కొనసాగుతాయన్నారు. స్టీల్‌ప్లాంటే లేకుంటే విశాఖ అభివృద్ధి ఇంతలా జరిగుండేది కాదని, వేలాది మందికి ఉద్యోగాలు దక్కేవి కాదని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరమైతే హిందుస్థాన్ జింక్ వలే మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు వారు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఉక్కు భూములను వాడుకొని పరిశ్రమను మూసివేస్తారని అన్నారు.

సుదీర్ఘకాలంగా కార్మికులు, ప్రజలు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉద్యమాలు చేస్తుంటే కేంద్రంలోని మోడీ సర్కారు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు శ్రీను, సిహెచ్.వెంకటరావు, వరసాల బాలకృష్ణ, డి.మధు, పిసి.దొర, వి.రాజేశ్వరరావు, డి.రమణ పాల్గొన్నారు.

జిఎస్‌టి ఆడిట్‌తో వ్యాపారం సులభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిఎస్‌టి డిపార్ట్‌మెంటల్ ఆడిట్ పన్ను విధించదగిన వ్యక్తి రికార్డులు, రిటర్న్‌లు, ఇతర డాక్యుమెంటేషన్‌లను పరిశీలించే ప్రక్రియ అని జిఎస్‌టి ఇంటెలిజెన్స్ ప్రిన్సిపల్ అడిషనల్ డైరెక్టర్ ఎంఆర్ఆర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం నగరంలోని మారియట్ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ జిఎస్‌టి చట్టంపై అవగాహన అవసరమన్నారు. ఆడిట్‌తో వ్యాపారం సులభతరమవుతుందన్నారు. సదస్సులో సిఐఐ విశాఖపట్నం ఛైర్మన్ డాక్టర్ పిపి.లాల్‌కృష్ణ, సిఐఐ విశాఖపట్నం ఫైనాన్స్ అండ్ టాక్సేషన్ ప్యానెల్ కన్వీనర్ అనిల్ కుమార్ బెజవాడ పాల్గొన్నారు.

సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా అధ్వాన రోడ్డును చూపుతున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి

ప్రజాశక్తి - సీలేరు : ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు రాకపోకలు సాగించే అంతర్రాష్ట్ర రహదారి జికె.వీధి మండలం ఆర్‌వి.నగర్ నుండి పాటగెడ్డ వరకు అధ్వానంగా ఉందని, ఈ పరిస్థితి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీకి కనబడటం లేదా? అని పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ప్రశ్నించారు. జికె.వీధి మండలం, సప్పర్ల రెయిన్ గేజ్ నుంచి ఆర్‌వి.నగర్ వరకూ ఆధ్వాన్నంగా ఉన్న రహదారిని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఇదేనా అభివృద్ధి అంటూ ఎమ్మెల్యే, ఎంపీకు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాలను కలుపుతూ ఉన్న ఈ రహదారి దారుణంగా ఉందంటే పాలకులకు సిగ్గు అనిపించడం లేదా? అని ప్రశ్నించారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ట్రైబల్ సబ్ ప్లాన్ కింద రూ.84 కోట్లు అంచనా వ్యయంతో ఈ రహదారి అభివృద్ధి చేయడానికి టెండర్లు నిర్వహించి, మూడు కంపెనీలకు ఈ పనులు అప్పగించామని, అయితే తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ఈ రహదారి నిర్మాణానికి తూట్లు పొడచారని ఆరోపించారు. రహదారి ఇంత అధ్వానంగా తయారై రోడ్డు మధ్య కాలువలు ప్రవహిస్తున్నాయని, ఈ మార్గంలో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి పనులు చేపట్టడానికి చర్యలు చేపట్టాలని, ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు మంచి ఆందోళన ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరించారు. కలెక్టర్ ఇదే రహదారి గుండా ప్రయాణం చేస్తూ రహదారి దుస్థితి చూస్తున్నారు కాబట్టి ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంటా నళిని, టిడిపి మండల అధ్యక్షుడు ముక్కలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -ములగాడ: విధులు నిలిపివేసారని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మల్కాపురం జనతా కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి. కొలపర్తి నాగేష్ కుమార్ (32) హెచ్‌పి మిలీనియం బంక్‌లో సూపర్‌వైజర్‌గా విధులను నిర్వర్తిస్తూ, భార్య పిల్లలతో జనతా కాలనీలో నివాసం ఉంటున్నాడు. తోటి సూపర్వైజర్ సెలవు పెట్టడంతో, ఆ విధుల్లో నాగేష్ కుమార్‌కు విధులు వేశారు, ఈ విషయాన్ని నాగేష్ కుమార్‌కు ముందు రోజే తెలిపారు, అయితే విధులకు ఆలస్యంగా వచ్చాడని తోటి సూపర్‌వైజర్ శివకుమార్ మందలించడంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఫ్యాన్ హుక్కుకు ఉరేసుకున్నాడు. ఐఒసి బంకులో విధులు నిర్వహిస్తున్న నాగేష్ భార్య విధులు ముగించుకొని ఇంటికి చేరుకునే సరికి ఫ్యాన్ హుక్కుకు ఉరేసుకుని వేలాడుతున్న భర్తను చూసి లబోదిబోమంటూ కేకలు వేసింది. చుట్టుపక్కలవారు వచ్చి చూసేసరికి అప్పటికే మృత్యువాత పడ్డారు. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. మల్కాపురం సిఐ జిడి.బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య విద్యను దూరం చేయడం దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మెడికల్ సీట్లలో ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 107, 108లను తక్షణం రద్దు చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు డిమాండ్ చేశారు. అల్లిపురంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బి, సి కేటగిరీలను రద్దు చేసి రిజర్వేషన్ల ప్రకారం సీట్లను భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే అణగారిన వర్గాల రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తూ ప్రైవేటు కళాశాలల్లో మేలు జరిగేలా ప్రభుత్వం ఎలా చేస్తుందని ప్రశ్నించారు.